నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, శనివారం 17 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI


## నాలుగు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నందికొండ, ఆగస్టు 16 : శ్రీశైలం నుంచి వరద కొనసాతుండడంతో నాగార్జునసాగర్ డ్యామ్ నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి 79,617 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో అదే స్థాయిలో అవుట్ ఫ్లో కొనసాగిస్తున్నారు. క్రస్ట్ గేట్ల ద్వారా 32,400 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7,518, కుడి కాల్వ ద్వారా 8,067, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,232, వరద కాల్వ ద్వారా 600, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



సాగర్ నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

# రుణమాఫీ అసంపూర్ణం..!

## రైతు రుణమాఫీ గందరగోళం.. ఆగమాగం



### మూడు విడుతల్లోనూ కాగితపు లెక్కలే..

- 30 నుంచి 40శాతం మందికి జమ కాని డబ్బులు
- మూడో విడుతలో ఇంకా విడుదల కాని అర్హుల జాబితా
- అన్నదాతల అకౌంట్లలో అమౌంట్ వేయలే..
- పేరుకే రైతులకు గ్రీవెన్స్ సెల్, ప్రత్యేక కౌంటర్లు
- 730 దరఖాస్తుల్లో ఒక్కటి కూడా పరిష్కరించని వైనం
- సర్కారు తీరుపై అన్నదాతల తీవ్ర ఆగ్రహం

'మాటిచ్చినం.. మాఫీ చేసినం.. రూ. 31వేల కోట్లతో రుణమాఫీ దేశంలోనే ఓ చరిత్ర.. పంద్రాగస్టు రోజే రూ. 2లక్షల రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకున్నం.' ఇవీ ఖమ్మం సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు. కానీ ఆయన మాటలకు.. చేతలకు ఏమాత్రం పొంతనే లేదు. క్షేత్రస్థాయిలో ఏ రైతును పలుకరించినా అసలు రుణమాఫీ ఎవరికి చేశారని దుమ్మెత్తిపోస్తున్నారు. జిల్లాలో రుణమాఫీ అసంపూర్ణంగా మారింది. అంతా కాగితం మీద లెక్కలే తప్ప.. సగం మందికి కూడా మాఫీ డబ్బులు జమ కాలేదు. గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినా ఎవరికీ ఫాయిదా లేకుండాపోయింది.

– యాదాద్రి భువనగిరి, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ)

### కాగితాలపైనే లెక్కలు..

అసెంబ్లీ ఎన్నికల ముందు రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. మాఫీ ఒకే సారి చేస్తామని గతంలో కాంగ్రెస్ ప్రకటించినా.. ఇప్పుడు మాత్రం విడుతల వారీగా చేస్తున్నది. తొలుత రూ.లక్షలోపు రుణాలు ఉన్నోళ్లకు మాఫీ చేస్తామని ప్రకటించింది. గత నెల 18నుంచి రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రైతు వేదికల్లో కార్యక్రమాలు అంటూ హంగూఆర్భాటాలు చేసింది. తొలి విడుతలో భాగంగా 36,483 మందిని అర్హులుగా గుర్తించినా.. 33,151 మందికి మాత్రమే ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ఇంకా 3,332 మందికి పెండింగ్‌లో పెట్టారు. ఇక రెండో విడుతలో 17,991మంది అర్హులను గుర్తించగా, రూ.176.12 కోట్లు మాఫీ చేయాల్సి ఉంది. వీరిలో సుమారు 30 నుంచి 40శాతం మందికి మాఫీ కాలేదని రైతుల ద్వారా తెలుస్తున్నది. మూడో విడుతలో 13,011మంది రైతులకు రూ. 164.66 కోట్లు ఖాతాల్లో జమ చేయాలి. కానీ ప్రభుత్వం చెప్తున్న లెక్కలకు.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితి చాలా తేడా ఉంటున్నది. ప్రభుత్వం విడుదల చేసిన అర్హుల జాబితాలో పేర్లున్నా మాఫీ కాకపోవడంపై అన్నదాతలుతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



### మూడో విడుతలో డేటానే లేదు.. మాఫీ అయ్యిందట..

మొదటి, రెండో విడుతలో రుణమాఫీ సమయంలో అర్హుల పేర్లతో కూడిన జాబితాను వ్యవసాయ శాఖ విడుదల చేసింది. అందులో గ్రామాలు, మండలాల వారీగా వివరాలు పొందుపరిచింది. అయితే మూడో విడుతకు వచ్చేసరికి అసలు లబ్ధిదారుల వివరాలు ఇంకా విడుదల కాలేదు. వాస్తవానికి ఈ నెల 14న జాబితా రిలీజ్ కావాల్సి ఉండగా, 16వ తేదీ దాటినా లిస్ట్ బయటకు రాలేదు. అంతే కాకుండా మూడో విడుతకు సంబంధించి రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో ఎవరికీ జమ కాలేదు. కానీ సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రం సొంత డబ్బా కొట్టుకుంటున్నారు.

### గ్రీవెన్స్ సెల్ ఉత్తగనే..

రుణమాఫీ కాని రైతుల సమస్యల కోసం ప్రభుత్వం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసింది. ఇందుకు టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంచింది. దీనితోపాటు జిల్లా వ్యవసాయ అధికారి, మండల వ్యవసాయ అధికారి కార్యాలయాల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 730దరఖాస్తులు అందాయి. కానీ ఇందులో ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్‌లో పరిశీస్తుండగా.. 'డేటా నాట్ ఫౌండ్' అని చూపిస్తున్నాయి. అధిక శాతం మందికి డేటా నాట్ ఫౌండ్ అని చూపిస్తుండటంతో అధికారులు సైతం రైతులకు ఇదే విషయాన్ని తెలియజేస్తున్నారు. మరికొన్ని దరఖాస్తులకు ఆధార్ కార్డు వివరాలు మిస్ మ్యాచ్, బ్యాంక్ ఖాతా క్లోజ్ తదితర కారణాలను వివరిస్తున్నారు. టెక్నికల్ సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వం నిర్ణయం మేరకు రుణ మాఫీ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

- తుర్కపల్లి పీఏసీఎస్ పరిధిలో రెండు విడుతలు కలిపి 1,040 మందికి రుణమాఫీ కావాలి. కానీ ఇప్పటి వరకు 677మందికి మాత్రమే డబ్బులు జమ అయ్యాయి. ఇంకా 363మందికి రూ. 2.40 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.
- మోత్కూరు పీఏసీఎస్ పరిధిలో రెండు విడుతలు కలిపి 876మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉంది. కానీ అధికారిక లెక్కల ప్రకారం 318మందికి మాత్రమే మాఫీ అయ్యింది. ఇంకా 558మందికి పెండింగ్‌లో ఉంది. మూడో విడుత జాబితా ఇంకా రాలేదు.
- భూదాన్‌పోచంపల్లి పీఏసీఎస్‌లో 380మంది రైతులకు 230 మందికి మాఫీ కాగా, ఇంకా 150 మందికి రావాల్సి ఉంది. ఇదే మండలంలోని జూలూరు పీఏసీఎస్‌లో 501 రైతులకు 286 మందికి డబ్బులు జమ కాగా, ఇంకా 215 మందికి మాఫీ కావాలి. మొత్తంగా మండలంలో 365 మందికి రుణమాఫీ చేయాల్సి ఉంది.
- రాజాపేట పీఏసీఎస్ పరిధిలో రెండో విడుతలో 1,296 మందికిగానూ 708 మందికి మాత్రమే బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి. అనేక చోట్ల 30 నుంచి 40శాతం దాకా మాఫీ కాలేదని లెక్కలు చెబుతున్నాయి.

### ఇంతవరకూ రుణమాఫీ కాలేదు

నేను బ్యాంకులో తీసుకున్న రుణం ఇంత వరకూ మాఫీ కాలేదు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కాలయాపన చేస్తున్నది. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటివరకు మాఫీ చేయలేదు. నేను చందుపట్ల పీఏసీఎస్ బ్యాంకులో ఒక లక్షా డెబ్బై ఐదు వేల రూపాయలు తీసుకున్నా. మాఫీ జరుగుతుందని ఎదురుచూపులే తప్ప మాఫీ కావట్లేదు. అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురుతీస్తున్నది.

-కంచి మల్లయ్య, రైతుబంధు సమితి మండల మాజీ కోఆర్డినేటర్, భువనగిరి



## గుట్టలో పవిత్రోత్సవాలు పరిపూర్ణం

**నేటి నుంచి యథావిధిగా సుదర్శన హోమం, నిత్య తిరుకల్యాణోత్సవం**

యాదగిరిగుట్ట, ఆగస్టు 16 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం మహా పూర్ణాహుతి, పవిత్ర మాలధారణలతో అర్చకులు పవిత్రోత్సవాలను పరిపూర్ణం చేశారు. ప్రధానాలయంలో ఉత్సవ మూర్తులను నవకలశాలతో స్నపన తిరుమంజనం జరిపి దివ్య మనోహరంగా అలంకరించారు. యాగశాలలో స్వామి, అమ్మవార్లను అధిష్టింపజేసి పంచసూక్త, మూలమంత్ర హోమ పూజలు, మహా పూర్ణాహుతి పర్వాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.108 నూలు పోగులతో తయారు చేసిన మాలలను ఊరేగించారు. ప్రధానాలయంలో స్వయంభూ నరసింహ స్వామి, అలంకారమూర్తుల చెంత పూజలు చేసి, స్వామి, అమ్మవార్లను అలంకరించారు. ఈ పర్వాలను దేవస్థానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యుల ఆధ్వర్యంలో చేపట్టారు. పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోనూ స్వయంభువులకు పవిత్ర మాలధారణతో పవిత్రోత్సవాలను పరిపూర్ణం చేశారు.యాగశాలలో మూలమంత్ర హవనం జరిపి మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈఓలు జూశెట్టి కృష్ణ, రఘు తదితరులు పాల్గొన్నారు. వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా రెండ్రోజుల పాటు తాత్కాలింగా నిలిపివేసిన స్వామివారి సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి.



నర్సాపురంలో వన నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

రాజాపేట, ఆగస్టు 16 : వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ హనుమంత్ కె.జెండగే ఆధికారులను ఆదేశించారు. మండలంలోని నర్సాపూరంలో శుక్రవారం డ్రైడే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లె పకృతి వనం, వన నర్సరీ, డంపింగ్ యార్డుతో పాటు గ్రామంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. గ్రామంలో రోడ్ల వెంట ఖాళీగా ఉన్న స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పనులు చేపట్టాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమృత్ సరోవర్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన చెరువు పూడిక తీత పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ కిషన్, పంచాయతీ కార్యదర్శి పవన్ తదితరులున్నారు.



నార్కట్‌పల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

## రైతుల పక్షాన పోరాడేది బీఆర్ఎస్ పార్టీనే

- హామీలు అమలు చేయని రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలి
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, ఆగస్టు 16 : తెలంగాణ రైతుల పక్షాన పోరాడేది బీఆర్ఎస్ పార్టీనే అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నార్కట్‌పల్లి పట్టణంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేని అసమర్థ పాలన కాంగ్రెస్‌ది అన్నారు. ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీల అమలు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు అన్నారని, కానీ.. ఆరు గ్యారెంటీలు, ఏక కాలంలో రుణమాఫీ చేయకుండా రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. ఖమ్మం జిల్లా బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడిన తీరును చూసి ప్రజలు, మేధావులు కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేశామని ఆలోచిస్తున్నన్నారని తెలిపారు. ఆగస్టు 15 నాటికి రైతులందరికీ రూ.31వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి, రూ.9 వేల కోట్లు కోత పెట్టడం సరికాదన్నారు. స్పష్టత లేని రుణమాఫీపై రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వంపై తిరుగబడేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఏక కాలంలోనే రుణ మాఫీ జరుగుతుందని సోనియా చెప్పిన మాట ఏమైందని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు, ఏకకాలంలో రుణ మాఫీ అమలులో విఫలమైన రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాయాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు యానాల అశోక్ రెడ్డి, రాజిరెడ్డి, శ్రీధర్, ఉపేందర్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

## హామీలు అమలు చేయలేని రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి

**మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఆయనకు లేదు : ఎమ్మెల్సీ కోటిరెడ్డి**

మిర్యాలగూడ, ఆగస్టు 16 : ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను హామీల అమలులో విఫలమైన రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేయాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంకెన కోటి రెడ్డి డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలు అమలు చేస్తానన్న రేవంత్‌రెడ్డి 8 నెలలైనా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. దాదాపు 50 శాతం మంది రైతులకు వివిధ సాకులతో రుణమాఫీ చెయ్యలేదని ఆరోపించారు. వైరా సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి అర్థం లేని ఆరోపణలు చేశారని, కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఆయనకు లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీతో పాటు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు అన్నారని, ఇప్పటికీ ఆయన అదే మాట మీద ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 32లక్షల మంది రైతులకు రూ.31వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉండగా రూ.17,900 కోట్లు మాత్రమే మాఫీ చేశారని, అర్హులందరికీ ఎందుకు చెయ్యలేదో రేవంత్ చెప్పాలని ప్రశ్నించారు. మాటిమాటికీ బీఆర్ఎస్ పార్టీని బొంద పెడ్తానని రేవంత్‌రెడ్డి స్థాయికి మించి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరితోపాటు తన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో ఎంపీ సీట్లు ఎందుకు ఓడిపోయారని ప్రశ్నించారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక కార్పొరేటర్ స్థానం మాత్రమే గెలిచిందని, గతంలో హుజూరాబాద్, మునుగోడులో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా రాలేదని అన్నారు. ఇవన్నీ రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జరిగిన ఎన్నికలేనని గుర్తు చేశారు. ఇప్పటికైనా మాయమాటలు చెప్పడం మాని ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎండీ షోయబ్, ఫయాజ్, వినోద్‌నాయక్, శివ ఉన్నారు.

## ఆర్టీసీ కార్గోలో రాఖీ సేవలు

నల్లగొండ సిటీ/సూర్యాపేట అర్బన్, ఆగస్టు 16 : దూర ప్రాంతాల్లో ఉంటున్న సోదరులకు రాఖీ కట్టేందుకు వెళ్లలేని అక్కాచెల్లెళ్లకు ఆర్టీసీ శుభవార్త తెలిపింది. ఆర్టీసీ కార్గో ద్వారా ప్రత్యేకంగా రాఖీలు, స్వీటు బాక్సులను పంపించే సదుపాయం కల్పించింది. అనుబంధం, ఆప్యాయత పంచుకునేందుకు ఆర్టీసీ కల్పించిన అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌టీసీ ఆర్ఎం రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 7 డిపోల పరిధిలో అన్ని కార్గో కేంద్రాల్లో సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

సూర్యాపేటకు సంబంధించిన వివరాలకు 9154298695, 9618038372 నంబర్లలో సంప్రదించాలని సూర్యాపేట డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జానీపాషా తెలిపారు.

## వరలక్ష్మీ నమోస్తుతే..



భూదాన్‌పోచంపల్లి : లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో వరలక్ష్మి సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

శ్రావణమాసంలో రాఖీ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మి వ్రతాలను ఆచరించారు. ఆలయాలతోపాటు గృహాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిపాటలతో లక్ష్మి అమ్మవారిని కొలిచారు. కుంకుమార్చనలు, అభిషేకాలు చేశారు. మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి కనిపించింది.

## ఫీవర్ సర్వే ప్రారంభం

**తొలిరోజు 60,490 గృహాలకు వెళ్లిన 1,466 బృందాలు**

- 769 మందికి ప్రాథమిక లక్షణాలు ఉన్నట్లు గుర్తింపు
- 259 డెంగ్యూ, 83 ఇతర పరీక్షలకోసం శాంపిల్స్ సేకరణ

నీలగిరి, ఆగస్టు 16 : సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటికే రెండు దఫాలుగా ఇంటింటి జ్వర సర్వే నిర్వహించిన వైద్యారోగ్య శాఖ శుక్రవారం మూడో సారి కూడా ప్రారంభించింది. వెయ్యి ఇండ్లకు ఒకటి చొప్పున జిల్లావ్యాప్తంగా 1,485 సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 8 మున్సిపాలిటీల పరిధిలో 182 బృందాలు, 848 గ్రామ పంచాయతీల్లో 1,303 బృందాలు పనిచేయనున్నాయి. ఈ బృందంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్, పంచాయతీ అధికారులు ఉంటారు. తొలిరోజు 1,466 బృందాలు 60,490 గృహాల్లోని 2,21,785 మందికి సంబంధించిన ఆరోగ్య వివరాలు సేకరించారు. అందులో 769 మంది ప్రాథమిక లక్షణాలతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి స్టెరాయిడ్స్‌ను అందించారు. 259 మందికి డెంగ్యూ లక్షణాలు ఉండడంతో శాంపిల్స్‌ను తీసుకున్నారు. మరో 83 మందికి ఇతర వ్యాధి లక్షణాలు ఉండడంతో వారి నుంచి కూడా శాంపిల్స్ సేకరించారు. వీరి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పర్యవేక్షించనున్నారు. రెండుమూడ్రోజుల్లో జ్వరం తీవ్రత తగ్గకుంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ దవాఖానకు పంపించి పరీక్షలు నిర్వహిస్తారు. సాధారణ జ్వరం, జలుబు, దగ్గు ఉంటే మందులు అందించి మూడు రోజుల పాటు పర్యవేక్షిస్తారు.

## చేజ్ చేసి గంజాయి సీజ్!

- కిలోమీటర్ల కొద్దీ వాహనాల్లో వెంబడించి..
- సినీ ఫక్కీలో నిందితుల పట్టివేత

చౌటుప్పల్ రూరల్/పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 16: అది రద్దీగా ఉండే విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారి. శుక్రవారం మధ్యాహ్నం దాదాపు 12.30 గంటలు కావస్తున్నది. పంతంగి టోల్‌గేట్ వైపు నుంచి మితిమీరిన వేగంతో కారు దూసుకొస్తున్నది. అప్పటికే వచ్చిన సమాచారంతో హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు.. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల సహకారంతో రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలో రోడ్డుకు అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. బారికేడ్లను చూసి హైవేపై హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే మా ర్గంలోకి రాంగ్‌రూట్‌లోకి కారును పోనిచ్చారు. ఇంకేముంది.. మళ్లీ చేజ్.. ఆ ముందుకురాగానే కారును హైవేకు ఆనుకుని ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వైపు మళ్లించారు. పోలీసు వాహనాలు ఆ కారును వెంబడించాయి. చివరకు తప్పించుకునే క్రమంలో కారు వేగంగా స్తంభా న్ని ఢీకొట్టింది.. అందులోని నలుగురిని పోలీసులు పట్టుకున్నారు.. ఇదంతా క్రైమ్ సిరీస్‌లలో ని ఎపిసోడ్‌లా జరిగిపోయింది. తేరుకునేలోపే మళ్లీ పోలీసు వాహనాలన్నీ వెళ్లిపోయాయి..

శుక్రవారం ఖమ్మ, భద్రాచలం ప్రాంతాల నుంచి నలుగురు నిందితులు గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో నల్లగొండ టాస్క్ ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో నిందితులను వెంబడించారు. విజయవాడ జాతీయ రహదారిపై పంతంగి టోల్‌గేట్ దగ్గర ఎర్టిగా కారులో వస్తున్న నిందితులను పట్టుకునే ప్రయత్నం చేశారు. కానీ, నిందితులు టోల్‌గేట్ దగ్గర వాహనాన్ని ఆపకుండా, గేట్‌ను ఢీకొట్టి తప్పించుకున్నారు. అధికారులు వెంటనే హయత్‌నగర్ ఎక్సైజ్‌తోపాటు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలో హైవేకు అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే, బారికేడ్లను గుర్తించిన నిందితులు కారును రాంగ్‌రూట్‌లోకి మళ్లించారు. హైవేపై దాదాపు 500 మీటర్లు రాంగ్ రూట్‌లో వెళ్లి ఆ తర్వాత జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వైపు మళ్లారు. అటునుంచి బయటకు వెళ్లిపోవచ్చని భావించారు. కానీ, కాలనీకి ప్రవేశమార్గం, తిరిగి వెళ్లేమార్గం ఒకటేననే విషయం వారికి తెలియదు. కారు దాదాపు 150 కిలోమీటర్ల వేగంతో కాలనీలోకి వీధుల్లో చక్కర్లు కొట్టింది. కాలనీ వాసులు కొద్దిసేపు భయభ్రాంతులకు గురయ్యారు. అప్పటికే కాలనీ ప్రవేశమార్గం వద్ద పోలీసులు తమ వాహనాలతో మోహరించారు. అతివేగంలో కారును వెనక్కి తిప్పే క్రమంలో నిందితులు స్తంభాన్ని ఢీకొట్టారు. జాతీయ రహదారిపై మొబైల్ వెహికల్ కానిస్టేబుల్ వారిని పట్టుకునే ప్రయత్నంలో గాయపడ్డాడు. ఆ వెంటనే పోలీసులు నిందితులను పట్టుకున్నారు. కారులోని రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నల్లగొండ జిల్లాకు తరలించినట్టు స్థానిక పోలీసులు తెలిపారు.



కారులో నుంచి గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు



గంజాయితో పట్టుబడ్డ నిందితులు